మినీ రైతు బజార్ ఏర్పాటు..కలేనా?

నెరవేరని నేతల ఎన్నికల వాగ్దానం

మూన్నాళ్ల ముచ్చటైన సంచార రైతు బజార్



తెల్లవారు జామున రోడ్డు పక్కన విక్రయిస్తున్న తాజా కూరగాయలు కొంటున్న వినియోగదారులు



పీఎంపాలెంలో ఒక కూరగాయల దుకాణం

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలో ఉన్న వివిధ కాలనీల ప్రజలు నిత్యం తాజా కూరగాయల సమస్యతో సతమతమవుతున్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఆహారంలో తాజా కూరగాయల పాత్ర కీలకమని వైద్య శాస్త్రం చెబుతోంది. అయితే పీఎం పాలెం ప్రజలకు మాత్రం నేరుగా రైతు తీసుకొచ్చే తాజా కూరగాయలు లభ్యం కావడంలేదు. ప్రైవేటు కూర గాయల వ్యాపారులు, మారు బేరగాళ్ల పైనే ఆధారపడాల్సి వస్తోంది. అధిక ధరలకు కూరగాయలు కొనాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ఎన్నాళ్లు అని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కార్యరూపం దాల్చని మినీ రైతు బజారు ఏర్పాటు..: జీవీఎంసీ 5వ వార్డులో దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం రైతు బజారు ఏర్పాటు చేసింది. అయితే అది దూరంగా ఉండడంతో పీఎం పాలెం వాసులకు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేకపోయింది. దీంతో పీఎం పాలెంలో మినీ రైతు బజారు ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. అయితే అది ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు మినీ రైతు బజారు ఏర్పాటుకు కృషి చేస్తామని వాగ్దానాలు గుప్పిస్తూనే ఉన్నారు. ఆచరణకు మాత్రం నోచుకోవడంలేదు.

బింద్రానగర్‌లో మరీ దారుణం : జీవీఎంసీ 8వ వార్డులోని బింద్రానగర్ కాలనీలో కూరగాయలు విక్రయించే వారు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ రైతు బజారు అందుబాటులో లేదని, ఆటోలో మాత్రమే వెళ్లాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. ఆటో చార్జీలు చెల్లించే బదులు తాజాగా ఉన్నా లేకపోయినా బయటి వ్యాపారుల దగ్గరే తీసుకోక తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి పీఎం పాలెంలో మినీ రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూన్నాళ్ల ముచ్చట

గతంలో పీఎం పాలెంలోని వివిధ కాలనీల ప్రజల సౌకర్యార్థం సంచార రైతు బజారు ఏర్పాటు చేశారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు రైతు బజారులో విక్రయించే ధరలకే తాజా కూరగాయలు లభించేవి. కొన్నినెలలు గడవక ముందే సంచార రైతు బజారును ఆపేశారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇదిలా ఉండగా రైతు బజారులో విక్రయాలకు లైసెన్స్ లేని కారణంగా కొంత మంది వ్యాపారులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించి వినియోగదారుల మెప్పు పొందుతున్నారు. అయితే వారు ఎప్పుడో గాలి వాటుగా వచ్చి తాము పండించిన కూరగాయలను నిమిషాల్లో విక్రయించి మాయమవుతారు. వినియోగదారులు కూడా తాజా సరకు లభిస్తుందన్న ఆశతో వీరి కోసం ఎదురు చూస్తుంటారు.



రోడ్డు పక్క కూరగాయల దుకాణం

తెల్లవారితే కూరగాయల సమస్య..



కూరగాయల సమస్య ఒక నాటిది కాదు. సమయానికి వెళ్తేనే తాజా కూరగాయలు లభిస్తాయి. నేరుగా పండించిన కూరగాయలు రోడ్లపై విక్రయించే వారి వద్దకు వేకువ జామునే వెళ్లాలి. అక్కడ కూడా తోటి వినియోగదారులతో పోటీ పడాలి. ఒక్కోసారి ఉత్త చేతులతో తిరిగి రావాలి.

– డి.కుటుంబరావు, వుడా కాలనీ

ప్రభుత్వ అజమాయిషీతో దుకాణాలు తెరవాలి



బింద్రానగర్‌లో ప్రభుత్వ అజమాయిషీతో కూరగాయల దుకాణం తెరవాలి. స్థానికులకు తాజా కూరగాయలు లభించడంలేదు. వృద్ధులు, మహిళలు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రైతు బజారుకు వెళ్లాలంటే ఇబ్బంది. ట్రాఫిక్ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వి.అప్పారావు, బింద్రానగర్ కాలనీ

శ్రీకృష్ణ లీలలపై గానామృతం



శ్రీకృష్ణ గానామృతాన్ని ఆలపిస్తున్న కళాకారిణి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో గల శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూమ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణలీలలపై గానామృతం కురిపించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ కళాకారులు డాక్టర్ శారదా సుబ్రహ్మణ్యం, ఐవీఎల్ శాస్త్రి త్యాగరాజ ఆరాధన ట్రస్ట్‌కు చెందిన వెడవెల్లి భావన (వయోలిన్), యశోద నందన (వయోలిన్), మాస్టర్ సీహెచ్ చాణక్య (మృదంగం)చే లయబద్ధంగా శ్రీకృష్ణ లీలలను వినిపించగా, కళాకారులను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అభినందించారు. శ్రీకృష్ణ అర్పణ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణుడికి ప్రతి ఆదివారం కళ ద్వారా భక్తి సాంస్కృతిక సమర్పణలో పాల్గొనే కళాకారులు 95425 11108 నంబర్‌లో సంప్రదించాలని అంబరీష దాస కోరారు.

పర్యాటకులను గౌరవించాలి



స్పీడ్ బోట్ డ్రైవర్లు, లైఫ్‌గార్డ్‌లకు సూచనలిస్తున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: రుషికొండ బీచ్‌కు వచ్చే పర్యాటకులను గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని రుషికొండ మెరైన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఈ బీచ్‌లో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్‌లు, స్పీడ్ బోట్ డ్రైవర్లు, ఇతర సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రుషికొండ బీచ్‌కు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, వారితో గౌరవంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మెరైన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వనరుల పరిరక్షణపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మధురవాడ: ప్రకృతి సమస్త జీవరాశులతో కళకళలాడాలని సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ విశాలాక్షి అన్నారు. మల్లయ్యపాలెం ఓ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పకృతి వనరులు కాపాడుతూ పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. భూగోళం మీద ఏ జీవి అంతరించినా అది మానవాళికే నష్టమన్నారు. భూమి మీద ఉండే ప్రతి జీవినీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. భూమిని కాపాడే బాధ్యత మానవాళిదేనన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ దీన బందు, జీవీ రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురు చంద్రంపాలెం విద్యార్థుల ఎంపిక



ఓహెచ్ కోటాలో ఎంపికైన కావ్య

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వివిధ రంగాల్లో తమ సత్తా చాటుతూ వస్తూ ఉన్నారు. గతంలో ఆరుగురు విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా.. తాజాగా ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని నాయన కావ్య ఓహెచ్ కోటాలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినికి ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కావ్య తల్లి మహాలక్ష్మి గృహిణి, తండ్రి రామారావు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది తన లక్ష్యమని కావ్య తెలిపింది. గతంలో ఈ పాఠశాలకు చెందిన సోపేటి శిరీషా, షీల లావణ్యలు నూజివీడు ట్రిపుల్ ఐటీకీ, కర్రి తనిష్ సోమిత్ ఆర్కే వ్యాలీ, కనకం పుణ్యావతి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, సయ్యద్ హబీబుల్ రెహమాన్, చెల్లూరి భరత్ చంద్రిలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

జర్నలిస్టుల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న భీమిలి నియోజకవర్గ విలేకరులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం భీమిలి రోడ్డులోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ప్రశాంతంగా జరిగింది. భీమిలి, తగరపువలస, పద్మనాభం, ఆనందపురం విలేకరులకు ఇందులో భాగస్వామ్యం కల్పించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బోని ఈశ్వర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దొంతల చినశ్రీను, ఉపాధ్యక్షులుగా రౌతు నాగరాజు, బూసర శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోరాడ సూరిబాబు, కోశాధికారిగా కోల వెంకటశివప్రసాద్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారుగా పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిగా బుగత అప్పలనాయుడు ఎంపికయ్యారు. వీరిని నియోజకవర్గ విలేకరులు అభినందించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది

పీఎం పాలెం: ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ పరిధిలోని కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సుమారు 50 మంది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారితో అప్పటికప్పుడు కొత్త హెల్మెట్‌లు కొనిపించారు. హెల్మెట్ తీసుకొచ్చి ధరించి తమ వాహనాలు తీసుకుపోవచ్చని, మొదటి తప్పుగా అవకాశం కల్పించామని ఎస్ఐ తెలిపారు. హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలి వెళ్లిన నాయకులు



కుంచమాంబ ఆలయం నుంచి బయలుదేరుతున్న 2వ వార్డు నాయకులు, కార్యకర్తలు



చిట్టివలస బంతాట మైదానం నుంచి తరలివెళ్తున్న 1వ వార్డు నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి భీమిలి జోన్ 1, 2 వార్డుల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు 10 కార్లు, 4 వ్యాన్లు, ద్విచక్ర వాహనాలతో బయలుదేరి వెళ్లారు. బ్యాంకు కాలనీ కుంచమాంబ ఆలయం నుంచి బయలుదేరిన వారిలో పార్టీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సీనియర్ నాయకులు అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, చిప్పాడ వెంకటేష్, కొండపు సూరిబాబు, శీరపు శ్రీరాములు, తోణంగి ఎల్లాజీ, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, బోర రామారావు, ఇంజే వరలక్ష్మి, డెక్కతి శ్రీనివాసరెడ్డి, కొసన సూరిరెడ్డి, చిల్ల సూరిబాబు, బోర వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు.

- చిట్టివలస బంతాట మైదానం నుంచి ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపలలి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. వీరిలో పెనుమాక జాన్‌చార్లీ, ఎస్సీ సెల్ నాయకులు గండ్రేటి ఈశ్వరరావు, సిమ్మల ప్రసన్న, నీలాపు రామిరెడ్డి, చింతగుంట శివ, లెంక రమేష్, గిడుతూరి మురళి తదితరులు ఉన్నారు.

కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలపై అధికారుల మీనమేషాలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 173లో విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక గెడ్డ స్థలంలో గత ఫిబ్రవరిలో రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. కబ్జాదారులు 5 నెలల విరామం అనంతరం మళ్లీ కూల్చిన చోటే దర్జాగా నిర్మాణాలు చేపట్టగా.. విద్యుత్ శాఖ కూడా కళ్లు మూసుకుని వాటికి విద్యుత్ మీటర్లు జారీ చేసింది. 'కూల్చిన ఆక్రమణల స్థానంలో మళ్లీ నిర్మాణాలు' అనే శీర్షికన ఈ నెల 6న వెలువడిన వార్తపై ఆనందపురం రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తహసీల్దార్ లేరని, స్టేట్‌మెంట్ నమోదు చేశామని, వీఆర్వో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగాలేదని, స్టేట్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశామని వారం రోజుల పాటు సాకులు చూపిస్తూ కబ్జాదారులను రక్షిస్తున్నారని గంభీరం వాసులు చెబుతున్నారు. 5 నెలల కిందట అక్రమ నిర్మాణం పేరుతో కూల్చిన రెవెన్యూ అధికారులే.. మళ్లీ అదే చోట నిర్మాణం చేపడితే ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకుల ప్రలోభాలకు లోబడి ఆనందపురం రెవెన్యూ అధికారులు వత్తాసు పలికితే ఇక పంచాయతీలో మిగిలిన చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాక తప్పదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాబూ.. బోర్ రిపేర్ చేయించండి

రెండిళ్లకే టీడీపీ 'తొలి అడుగు' పరిమితం



నీరు సరిగా రావడం లేదు.. బోరైనా బాగుచేయించాలని కోరుతున్న మహిళ

మధురవాడ: టీడీపీ ఎంతో అట్టహాసంగా నిర్వహించాలని భావిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం భీమిలి నియోజకవర్గంలో మాత్రం మొక్కుబడిగా సాగుతోంది. కొద్ది రోజుల క్రితం పరదేశిపాలెంలో మూడిళ్లకే పరిమితం అయిన కార్యక్రమం ఆదివారం రెండిళ్లకి తగ్గిపోయింది. పైగా ఈ కార్యక్రమాలకు మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారితో పాటు భీమిలి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు తరలి వస్తున్నా.. తీరా ఇక్కడకి వచ్చే సరికి మమా అనిపిస్తుండడంతో ఈసురో మని నాయకులతో పాటు ప్రజలు కూడా వెనుదిరుగుతున్నారు.

సమస్యలతో స్వాగతం..

జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ సమీపంలోని శ్రీనివాసనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండిళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మొదటి ఇంట్లో తమ కుటుంబంలో ఒక్కరికే తల్లికి వందనం డబ్బులు పడ్డాయని చెప్పగా, రోడ్డుమీద ఈశ్వరమ్మ అనే మహిళ బాబూ నీరు సక్రమంగా రావడం లేదు.. బోరు అయినా రిపేరు చేయించండి అని కోరింది. కనీసం లైట్లు కూడా వెలగడం లేదని, కనీసం ఎమ్మెల్యేకి చెప్పుకుందామంటే ఆ భాగ్యం కూడా కరువయిందని మరికొందరు వాపోయారు. రెండో ఇంటికి వెళ్లే సరికి తమ ఇంటి శ్లాబు పాడైపోయి వర్షం వస్తే కారిపోతుందని మరో మహిళ చెప్పింది. ఇలా సమస్యలే స్వాగతం పలికాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, టీడీపీ నాయకులు పిల్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు, అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభం



సొసైటీ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలో ఆదివారం కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దీని నిర్వాహకులు డాక్టర్ కిరణ్ నందివాడ మాట్లాడుతూ పేదలకు తమ వంతు సాయం అందించేందుకు ఈ సొసైటీ ఏర్పాటు చేశామన్నారు. పేదలకు ఉచితంగా, ఆర్థిక స్థోమత ఉన్నవారికి నామమాత్ర రుసుము తీసుకుంటామని తెలిపారు. విశాఖలో తాము ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో అవసరమైన వారికి వైద్యం అందిస్తామని అన్నారు. అలాగే టెలీకాన్ఫరెన్స్ ద్వారా రోగులను చూసే విధానాన్ని నిర్వహిస్తున్నామని, ఇది అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు కూడా తమ వంతు సాయం అందిస్తున్నామని వెల్లడించారు, ఇందులో సొసైటీ అధ్యక్షుడు బి.ఎస్.సుబ్బారావు, కార్యదర్శి దువ్వి నరేంద్ర, కళాసాహితీ సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ఫోరం ఫర్ బెటర్ భీమిలి అధ్యక్షుడు రాజేటి బసవకృష్ణమూర్తి, ఓఎస్‌టీ ఫౌండేషన్ అధ్యక్షుడు శివ దళాయి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



శిల్పారామంలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. అన్నమయ్య కీర్తనలు, వివిధ కూచిపూడి నృత్యాంశాలకు కోలాటం ప్రధానంగా నర్తించి కళాకారులు ఆకట్టుకున్నారు. బుజ్జి బుజ్జి గణపయ్య గీతానికి ప్రదర్శించిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా.. భావము లోనా.. జతిస్వరం.., ముకుందా ముకుందా.. తదితర గీతాలతోపాటు కోలాటం బ్యాక్‌గ్రౌండ్‌గా అరకు థింసాను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజీ, సంజన, మన్విత, నవ్య తదితర కళాకారులు పాల్గొనగా.. మోహనలక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

ఐఐఎంవీలో పీహెచ్‌డీ రెండో బ్యాచ్ ప్రారంభం



రెండో బ్యాచ్ ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీలో పాల్గొన్న నిపుణులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం లోని ఐఐఎం విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ రెండో బ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. పని చేసే నిపుణుల అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సును ప్రత్యేకంగా రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోగ్రాంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, బహుళ క్యాంపస్‌ల్లో ప్రత్యక్ష అనుభవాలు ఉంటాయని వారు వివరించారు. కొత్త బ్యాచ్‌లో ఆటోమొబైల్, ఏవియేషన్, కన్సల్టింగ్, బ్రాడ్‌కాస్టింగ్, విద్య, ఐటీ, టెలికమ్యూనికేషన్ వంటి వివిధ రంగాల నుంచి 17 మంది నిష్ణాతులైన వ్యక్తులు ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐఎం రాంచీ డైరెక్టర్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నం నిర్మాణంలోనే కాకుండా దృక్పథంలో కూడా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని ప్రశంసించారు. సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్ కుమార్ నాయర్ మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లోని స్కాలర్‌లు మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, స్ట్రాటజీ, డెసిషన్ సైన్సెస్ వంటి విభిన్న నిర్వహణ విభాగాల నుంచి వచ్చినవారని, ఇది కఠినమైన, ఆకర్షణీయమైన విద్యా అనుభవానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రోగ్రాం చైర్మన్ ప్రొఫెసర్ అమిత్ శంకర్ మాట్లాడుతూ విజయవంతమైన డాక్టోరల్ ప్రయాణానికి అభిరుచి, సాధన, పట్టుదల, సహనం అవసరమని, ఇవి మార్కెటింగ్ మిశ్రమంలో కీలకమని అభివర్ణించారు. ఐఐఎంవీ డీన్ సూరిశెట్టి విజయభాస్కర్ ప్లాట్‌ఫాం ఎకానమీ స్వర్ణయుగంలో పరిశోధన, జ్ఞాన సృష్టి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశోధన ఆలోచనలలో పరివర్తన తీసుకువస్తుందని, ఇది వ్యక్తీకరణను పదును పెట్టడానికి, కమ్యూనికేషన్‌ను పెంచడానికి, అర్థవంతమైన లక్ష్యాల వైపు ఇతరులను ప్రేరేపించడానికి, ప్రభావితం చేయడానికి సహాయపడుతుందన్నారు. చివరగా డీన్ కావేరి కృష్ణన్ మాట్లాడారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



మధురవాడలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు.. అధికారం చేపట్టాక అవే విధానాలను అమలు చేస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు డి.అప్పలరాజు విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మధురవాడ పరిసర ప్రాంతాలు ముత్యాలమ్మ కాలనీ, వివేకానందనగర్‌ల్లో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంపదను అదాని బడా సంస్థకు దోచి పెట్టడానికి కూటమి ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేట్‌పరం చేస్తోందని, ఇది దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.కుమారి, ఎస్.పూజిత, టి.అప్పలనర్సింహా, ఎస్.రాములప్పడు, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు సూచించారు. ఆదివారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పే అంశాలను అర్థం చేసుకుని భవిష్యత్తులో రానున్న పోటీ పరీక్షలకు సోపానాలుగా మలుచుకోవాలన్నారు. వివిధ పాఠశాలల నుంచి 150 మంది వరకు విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు జి.వి.అప్పారావు, వై.వి.రమణ, జగన్నాథం, దుష్యంత్, శ్రీనివాస్, భరత్ పాల్గొన్నారు.

దబ్బంద టిడ్కో ఇళ్లకు సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బంద టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. ఆదివారం టిడ్కో దబ్బంద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న దబ్బందలో 40 బ్లాకుల్లో 1920 టిడ్కో ఇళ్లు ఉన్నాయన్నారు. వీరికి కేటాయింపు పత్రాలు కూడా ఇచ్చారన్నారు. ఇక్కడికి బస్సు సౌకర్యం లేదన్నారు. అలాగే నిత్యావసర సరుకులు తీసుకుని రావడానికి మూడు కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రుణాలు రద్దు చేస్తామని ప్రకటించి పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.భానుప్రసాద్, ఉపాధ్యక్షుడు పి.ఈశ్వరరావు, కార్యదర్శి ఎన్.గోవింద, సహాయ కార్యదర్శి సీహెచ్ రమణమ్మ, కోశాధికారి కె.నారాయణరావు, కన్వీనర్ సీహెచ్ నూకరత్నం, ఎస్.జయశ్రీ, డి.దివ్య, సీపీఐ ఆరిలోవ కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కొండను తవ్వేస్తున్నారు..



రాజీవ్‌నగర్‌లో కొండను తవ్వేస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో భూ ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చెరువులు, గెడ్డలు, కొండలు అన్నిటినీ కబ్జా చేస్తున్నారు. ఆదివారం ఎండాడ దరి రాజీవ్‌నగర్‌లో యథేచ్ఛగా పొక్లయినర్‌తో చదును చేయడమే దీనికి ప్రత్యేక సాక్ష్యం. విచ్చల విడిగా భారీ మిషన్లు ఏర్పాటు చేసి కొండను తవ్వి ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే ఈ కొండ ఆక్రమణలకు గురైంది. తాజాగా కొండను తవ్వి ఆక్రమించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే దీని వెనుక ఆ ప్రాంతానికి చెందిన నాయకుడి అండదండలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు తెలిసినప్పటికీ మౌనం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఇక్కడి వారు కోరుతున్నారు.